

కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో టిఫిన్ చేస్తున్న బాలికలు



మానకొండూర్ : విద్యార్థినికి టిఫిన్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న మంత్రి గంగుల కమలాకర్



హుజూరాబాద్ టౌన్ : విద్యార్థికి టిఫిన్ తినిపిస్తున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, చిత్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్

# అల్పాహారం.. ఆరోగ్య వరం

## ఉమ్మడి జిల్లాలో అట్టహాసంగా 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' ప్రారంభం

కరీంనగర్ రూరల్/ మానకొండూర్/ గంగాధర/ హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 6 :చక్కని చదువు కోసం ఉదయాన్నే విద్యార్థుల కడుపు నింపాలన్న గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'ను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. నియోజకవర్గ కేంద్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో ప్రారంభించిన అనంతరం పిల్లలకు అల్పాహారాన్ని వడ్డించడమే గాకుండా వారితో కలిసి ఆరగించారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ జడ్పీ హై స్కూల్‌లో మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. విద్యార్థులకు వడ్డించిన తర్వాత వారితో కలిసి టిఫిన్ చేశారు. హుజూరాబాద్ జడ్పీ హెచ్ఎస్‌లో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని గంగాధర ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చందోళి జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి, విద్యార్థులకు వడ్డించారు. రుచి బాగున్నదని నిర్వాహకులను ప్రశంసించారు. కోరుట్ల రూరల్ మండలం మాదాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాలలో ధరూర్ క్యాంపు జడ్పీ స్కూల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల నెహ్రూనగర్ జడ్పీ పాఠశాలలో కలెక్టర్ అనురాగ్ జయంతి, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభించారు. పెద్దపల్లి అమర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించి, పిల్లలకు వడ్డించారు. రామగుండం బల్దియా పరిధిలోని అంగడీబజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మండలం కాకర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పెద్దపల్లి జడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ ప్రారంభించి, విద్యార్థులకు వడ్డించారు.



గంగాధర : విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# నగరంలో శ్రీకృష్ణుడి దివ్యక్షేత్రం



ఆలయం నిర్మించే ప్రాంతం పరిశీలిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

- **రాధాగోవిందుడి మందిరానికి భూమిపూజ**
- **హాజరుకానున్న మంత్రి గంగుల**

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 6: ఇస్కాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ మణి కిరీటంలో మరో దివ్యమైన క్షేత్రం రూపుదిద్దుకోబోతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మెట్‌పల్లి సమీపంలో అద్భుత మందిరం ఉండగా, ఇప్పుడు నగరంలో రాధాగోవిందుడి మందిర నిర్మాణం కాబోతున్నది. బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్‌లో ఆలయ నిర్మాణానికి పూనుకోగా, అందుకు బైపాస్ రోడ్డులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలో మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. శనివారం మంత్రి గంగుల, ఇస్కాన్ నిర్వాహకులు భూమిపూజ చేయనున్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో జగన్నాథ రథక్రాలతో భారీ శోభాయాత్ర చేపట్టనున్నారు. తెలంగాణ చౌక్ నుంచి ఆలయ నిర్మాణ స్థలం వరకు దాదాపు పది వేల మందితో శోభా యాత్ర తీయనున్నారు. నగరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని భక్తులు, విదేశీయులు, ఇస్కాన్ బాధ్యులు, మంత్రి గంగుల, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ యాదగిరి సునీల్ రావు, కలెక్టర్ గోపి, పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు.

### ఇస్కాన్ అంటే..

ఇస్కాన్ అనేది అంతర్జాతీయ కృష్ణ సమాజం. ఇది అంతర్జాతీయంగా భగవద్గీతను ప్రచారం చేయడం, కృష్ణ తత్వం, భక్తి యోగాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ధార్మిక చింతనను పెంపొందిస్తూ ఉంటారు. ఈ సంస్థను ఏసీ భక్తి వేదాంత ప్రభుపాదు స్థాపించారు. ప్రపంచంలో ఉన్న కృష్ణ భక్తులు అందరిని ఒకే వేదిక మీదికి తీసుకొని రావడం తద్వారా మానవతావాదాన్ని దాని ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందడం. ముఖ్యంగా సంకీర్తన ఉద్యమం ద్వారా సామూహిక సంకీర్తనలు చేపట్టడం, సామూహిక సంకీర్తనల ద్వారా భక్తి ఉద్యమాన్ని నలువైపులా వ్యాపింపచేయడం ఈ సంస్థ ముఖ్యోద్దేశం. ఇందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన కృష్ణ మందిరాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే దేశంలోని ప్రధాన నగరాల్లో ఆలయాలను నిర్మించారు.

### ఆధ్యాత్మిక వాతావరణం పెంపునకే..



కరీంనగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించుకే దివ్యమైన భవ్యమైన రాధాగోవిందుని మందిరాన్ని నిర్మిస్తున్నాం. ఇది ఇక్కడి ప్రజలు చేసుకున్న గొప్ప పుణ్యఫలం. ఈ ఆలయ కేంద్రంగా జిల్లాలో కృష్ణ తత్వాన్ని ప్రచారం చేయడం, భక్తి, ఆధ్యాత్మిక మార్గాన్ని అందిస్తాం. ఇలాంటి ఆలయ నిర్మాణం కోసం జిల్లా వాసులు ఎంతో ఆనందంగా ఎదురు చూస్తున్నారు.

**- డాక్టర్ రాజభాస్కర్‌రెడ్డి, ఇస్కాన్ ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యుడు**

### గొప్ప విషయం



కరీంనగర్ జిల్లా కేంద్రంలో రాధా గోవిందుడి ఆలయ నిర్మాణం చేపడుతుండడం చాలా ఆనందంగా ఉంది. ఇందుకోసం మంత్రి గంగుల కమలాకర్ ముందుకు వచ్చి మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించడం గొప్ప విషయం. నగర వాసులకు పర్యాటకంగా, ఆధ్యాత్మింగా కరీంనగర్ కేంద్ర భిందువుగా మారనున్నది.

**- తుమ్మల రమేశ్ రెడ్డి, ఇస్కాన్ ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యుడు**

# పర్లపల్లిలో ప్రగతి జాతర



జీపీ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- **అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రసమయి**
- **డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యేకు గ్రామంలో ఘన స్వాగతం**
- **ఆకట్టుకున్న ఒగ్గుడోలు కళాకారుల నృత్యాలు**

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 6: తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లిలో శుక్రవారం రాత్రి ప్రగతి జాతర నెలకొన్నది. ₹30 కోట్లతో వివిధ పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఊరికి చేరుకున్న ఆయనకు ప్రజలు సాదర స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లతో ఆహ్వానించారు. మహిళలు నుదుట తిలకం దిద్ది ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు, సారథి కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. యువకులు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆయన రిబ్బన్లు కట్ చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. తదనంతరం సర్పంచ్ మాదాడి భారతి అధ్యక్షతన గ్రామంలో ఏర్పాటు చేసిన పర్లపల్లి ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. పర్లపల్లి గ్రామాన్ని చూస్తుంటే పట్టణంలో పర్యటిస్తున్నట్టు అనిపిస్తున్నదన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. తెలంగాణ పల్లెలకు పర్లపల్లి గ్రామం స్ఫూర్తిగా నిలుస్తున్నదని చెప్పారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి మాదాడి రమేశ్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. అరవై ఏండ్లు అధికారం ఇస్తే కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఇప్పుడు ఆ పార్టీ గ్యారెంటీలను నమ్మవద్దని ప్రజలను కోరారు. చేసిన పనులను చూసి బీఆర్ఎస్‌కు పట్టంగట్టాలని కోరారు. అర్హులందరికీ దళిత బంధు అందుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, స్థానిక ఎంపీటీసీ ముప్పిడి సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజేశ్ పాల్గొన్నారు.